
ఓట్ల కట్టలను పరిశీలిస్తున్న ఆర్వో వెట్రిసెల్వి

కూటమిదే ఆధిక్యం

ఉమ్మడి ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు తొలి రౌండ్‌లో తెలుగుదేశం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం అధిక్యంలో నిలిచారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయానికి తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు ముగిసింది. మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేశారు. టేబుల్‌కు వెయ్యి ఓట్లు చొప్పున రౌండ్‌కు 28 వేల ఓట్లు లెక్కిస్తున్నారు. తొలి రౌండ్‌లో రాజశేఖరానికి 16,520 ఓట్లు రాగా పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు 5,815 ఓట్లు దక్కాయి. ఇతరులకు 3,249, చెల్లని ఓట్లు 2,416 వచ్చాయి. దీంతో టీడీపీ అభ్యర్థికి తొలిరౌండ్‌లోనే 10,705 ఓట్ల ఆధిక్యం లభించింది. రెండో రౌండ్ పూర్తయ్యే సరికి మరింత సమయం పడుతుంది. మంగళవారం ఉదయం పది గంటలకు తొలి ప్రాధాన్యత ఓట్లతో ఎవరు గెలుస్తారు ? లేదా.. రెండో ప్రాధాన్యత ఓట్ల పరిగణనలోకి వస్తారా?.. అన్నది తేలబోతుంది. తమ పార్టీ అభ్యర్థి రాజశేఖరానికి చివరి రౌండ్ వరకు ఇదే అధిక్యత దక్కుతుందని టీడీపీ వర్గాలు ధీమాతో ఉన్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఈ ఎన్నికల పోలింగ్ గత 27న జరిగింది. మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రెండు లక్షల 18 వేల 902 ఓట్లు పోలయ్యాయి. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు గాను 28 టేబుల్స్ వినియోగించి ఎనిమిది రౌండ్లలో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఓట్ల లెక్కింపునకు వీలుగా ఉదయం ఎనిమిది గంటల నుంచే సిబ్బంది అప్రమత్తమయ్యారు. తొలుత స్ట్రాంగ్ రూముల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. రౌండ్ల వారీగా బ్యాలెట్ బాక్సుల్లోని పత్రాలను బయటకు తీసి తొలుత కట్టలుగా కట్టారు. ఈ ప్రక్రియ యావత్తు కొనసాగేందుకు వీలుగా 28 టేబుళ్లలో కొనసాగించేందుకు వీలుగా మూడు షిఫ్టులలో 700 మంది సిబ్బంది, అధికారులను రంగంలోకి దించారు. సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అంత సులువుగా సాగదు. ఈసారి అదే పరిస్థితి ఆవిష్కృతమైంది. ఉదయం నుంచే సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాల్లో మోహరించి వారికి బ్యాలెట్ బాక్సులు తెరవడం, వాటిలో ఉన్న బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టడం వంటి ప్రక్రియను అప్పగించారు. తొలి మూడు గంటల్లో పోస్టల్ బ్యాలెట్‌లను పరిశీలించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లు 242 కాగా వీటిలో 201 బ్యాలెట్ పత్రాలు చెల్లుబాటు కాగా మరో 41 చెల్లకుండాపోయాయి. ఉదయం 11 గంటల నాటికే పోస్టల్ బ్యాలెట్‌ల తతంగాన్ని ముగించారు. సమాంతరంగా రౌండ్‌ల వారీగా బ్యాలెట్ పత్రాలు బండిళ్లగా కట్టలు కట్టే పనిని కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, మిగతా అధికారులు కౌంటింగ్ ప్రక్రియ ఆరంభం నుంచి క్షణక్షణం పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ కేంద్రంలో గుర్తింపు కార్డులున్న వారినే అనుమతించారు. మీడియాను నిర్దేశించిన ప్రాంతంలోనే ఉంచారు. కౌంటింగ్ కేంద్రంలోకి మధ్యాహ్నం నుంచి కొందరిని అనుమతించారు.


కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులతో రాజశేఖరం


కౌంటింగ్ కేంద్రంలో ఆర్వో వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

తొలి రౌండ్ ఫలితం వెల్లడి

- పేరాబత్తులకు 16,520.. ఆధిక్యం 10,705
- దిడ్ల వీరరాఘవులుకు 5,815 ఓట్లు
- సుదీర్ఘంగా సాగుతున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- ఓట్లను కట్టలుగా కట్టేందుకు 12 గంటలు
- రాత్రి 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఆరంభం.. అర్ధరాత్రి 12 గంటలకు తొలి ఫలితం
- నేటి మధ్యాహ్నానికి విజేతపై స్పష్టత

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

ఏలూరు క్రైం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రమైన సర్ సీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద ఎస్పీ కేపీఎస్ కిశోర్ పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసి స్వయంగా పరిశీలించారు. సోమవారం వేకువజామునే కౌంటింగ్ విధులకు నియమించబడిన ఉద్యోగులు, ఏజెంట్లను పోలీస్ సిబ్బంది మెటల్ డిటెక్టర్లతో, బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు నిర్వహించారు. సెల్‌ఫోన్‌లు బయట కౌంటర్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో ఏఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఎఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీఎస్పీ యుగంధర్ పలువురు అధికారులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్


బ్యాలెట్ బాక్సులను తీసుకొస్తున్న సిబ్బంది


కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు ఆలపాటి, లక్ష్మణరావు

గెలుపు దిశగా..!

- ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు.. ఐదు రౌండ్లకే ఆలపాటికి 47,872 ఓట్ల ఆధిక్యం

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ విజయం దిశగా దూసుకుపోతున్నారు. మొదటి రౌండ్ లెక్కింపుతోనే మెజారిటీని దక్కించుకున్న ఆయన రౌండ్ రౌండ్‌కు తిరుగులేని ఆధిక్యాన్ని కనబరుస్తున్నారు. గట్టి పోటీని ఇస్తారని అందరూ ఊహించిన పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు దారుణమైన ఓటమి చవిచూసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అర్ధరాత్రి 12:30 గంటలకు ఐదు రౌండ్ పూర్తయ్యేసరికి ఆలపాటికి 84,595 ఓట్లు సాధించి 47,872 ఓట్ల మెజారిటీతో ముందున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు 36,723 ఓట్లు సాధించారు. ఐదో రౌండ్ పూర్తయ్యే సరికి 1,40,297 ఓట్లు లెక్కించగా ఇందులో చెల్లని ఓట్లు 14,888.

బండిల్స్‌గా కట్టేందుకే అధిక సమయం..

రౌండ్‌ల వారీగా పది వేలకు తగ్గకుండా ఈ బండిళ్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల్లోపు సుమారు పది వేల ఓట్లతో మొదటి రౌండ్ బండిళ్లుగా కట్టగలిగారు. అప్పటి నుంచి 11వ రౌండ్ వచ్చే సరికి బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టేందుకు ఏడు గంటల సమయం తీసుకుంది. వాస్తవానికి కౌంటింగ్ కేంద్రంలో రౌండ్‌ల సంఖ్య, టేబుల్స్ సంఖ్య కాస్త పెంచి ఉంటే ఇంత సుదీర్ఘ సమయం పట్టేది కాదు. ఒకవైపు బ్యాలెట్ పత్రాలను బండిళ్లగా చేసేందుకు సమయం పడుతుండడంతో అభ్యర్థులతోపాటు ఎన్నికల ఫలితాలపై ఎదురుచూస్తున్న వారంతా ఉత్కంఠకు గురయ్యారు.

లెక్క మీది...కిక్కు మాది

ముదినేపల్లి : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సోమవారం మద్యం ప్రియులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. లెక్క మీది...కిక్కు మాది అన్నట్లుగా మందుబాబులు మద్యం తాగడం ఆపనే లేదు. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు మద్యం షాపులను మూసినప్పటికీ అనధికారికంగా మద్యం అమ్మకాలు జోరుగానే జరిగాయి. ముదినేపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం మత్తులో మునిగితేలారు.


ముదినేపల్లిలో బహిరంగంగానే మద్యపానం


సీఆర్‌రెడ్డి కాలేజ్‌లో సెకండ్ ఇయర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ఇంటర్ పరీక్షలకు 98 శాతం హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి):ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు/సంస్కృతం/హిందీ/ఉర్దూ పరీక్షలకు 14,319 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 13,964 (98 శాతం) మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 12,511 మందికి 12,274 మంది, ఒకేషనల్ విభాగంలో 1,808 మందికి 1,690 మంది హాజరుగా కాగా 355 మంది గైర్హాజరయ్యారు.

'ఓపెన్' పరీక్షలకు70 మంది గైర్హాజరు

ఏపీ సార్వత్రిక విద్యా పీఠం(అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏడు కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు తొలిరోజు నిర్వహించిన ఇంగ్లీషు పరీక్షకు 629 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 559 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఏలూరులో డీఈవో, చింతలపూడి, జంగారెడ్డిగూడెంలలో ప్రభుత్వ పరీక్షల సహాయకమిషనర్ శ్రీకాంత్, నూజివీడులో జిల్లా పరీక్షల కమిటీ (డెక్) సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వివరించారు.


ఎ.ఆర్.డి.జి.కె నగరపాలకోన్నత పాఠశాలలో నంబర్లు చూసుకుంటున్న ఓపెన్ ఇంటర్ విద్యార్థినులు

'పది' విద్యార్థుల హాల్ టిక్కెట్లు రెడీ

ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్‌టిక్కెట్లు బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో సోమవారం నుంచి అందుబాటులో ఉంచినట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్ లేదా మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) లేదా వాట్సాప్ నెంబరు 95523 00009కు 'హాయ్' సందేశాన్ని పంపి ఎడ్యుకేషన్ సర్వీస్‌పై క్లిక్ చేసి దరఖాస్తు నెంబరు, పుట్టిన తేదీని నమోదు చేయడం ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టిక్కెట్లను అన్ని పాఠశాలలు తమ లాగిన్‌ల లోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

పెద్దింటమ్మకు నీరాజనాలు

కైకలూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడోవ రోజు జలదుర్గసమేత పెద్దింటి అమ్మవారికి తృతీయవార్చన, కలశపూజ, ఖడ్గనామార్చన, ధూపసేవ, బాలభోగం, నీరాజన మంత్రపుష్పాలు, పంచహారతులు, పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, భక్తు లకు ఉచిత ప్రసాదాలను భుజబలపట్నానికి చెందిన అల్లూరి జ్ఞానేంద్రవర్మ, నాగలక్ష్మీ దంపతులు, అల్లూరి సురేష్‌రాజు, హిందు దంపతులు అంద జేశారు. సాయంత్రం ముదినేపల్లికి చెందిన కె.లక్ష్మీకుమారిచే గీతా పారాయణం ప్రవచనం చేశారు. ఈవో శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విలీన గ్రామాలకు.. గోదావరి జలాలు!



ఏలూరు కార్పొరేషన్‌లో చేరిన విలీన గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.129 కోట్లు వెచ్చించి గోదావరి కాల్వ ద్వారా తాగు నీరు అందించడానికి నగర పాలక సంస్థ అధికారులు డీపీఆర్ తయారు చేసి పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ చీఫ్‌కు పంపారు. అక్కడ ఆమోదం లభించగానే పనులు ప్రారంభించడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

- రూ.129 కోట్లతో డీపీఆర్ తయారీ
- అనుమతి రాగానే పనులు ప్రారంభం

ఏలూరు టూటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల క్రితం ఏలూరు నగరంలో చుట్టు పక్కల శనివారపుపేట, సత్రంపాడు, పోణంగి, వెంకటాపురం, తంగెళ్లమూడి, కొమడవోలు, మాదేపల్లి గ్రామాలు విలీనమయ్యాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం నగర పాలక సంస్థ పాలక మండలి ఎన్నిక సమయంలో ఏడు విలీన గ్రామాలకు గోదావరి నది నుంచి తాగు నీరందిస్తామని వాగ్దానాలు చేశారు. గెలిచిన అనంతరం ఆ మాటే మరచి పోయారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విలీన గ్రామాలకు గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు కూటమి ప్రభుత్వం ప్రస్తుతం చర్యలు చేపట్టింది. ఏడు విలీన గ్రామాలకు తాగునీటి సరఫరా చేసేందుకు 131 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయాలని అంచనా వేశారు. తొలి విడతలో 66 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విలీన గ్రామాల్లో 55 వేల మంది జనాభా ఉన్నారు. వీరందరికి తాగునీరందిం చేందుకు పోణంగి దగ్గర 2 వేల ఎంఎల్‌డీ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మిస్తారు. ఈ ట్యాంకు రాబోయే 30 ఏళ్లకు సరిపడేలా డిజైన్ చేస్తారు. ప్రతీ రోజు ఒక్కో మనిషికి 135 లీటర్ల చొప్పున తాగునీరందించేందుకు ప్లాన్ చేశారు. దీనిలో భాగంగా ఆరు వేల కుళాయిలు వేయనున్నారు. గ్రామానికి ఒకటి చొప్పున ఏడు ఎలివేటెడ్ రిజర్వాయర్లు నిర్మించనున్నారు. గోదావరి జలాలను తాగునీరుగా మార్చేందుకు పోణంగి దగ్గర 10 ఎంఎల్‌డీ, పంపుల చెరువు వద్ద 10 ఎంఎల్‌డీ కెపాసిటీతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం వాటా 50 శాతం నగర పాలక సంస్థ వాటా 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 20 శాతం నిధులు వెచ్చించనున్నారు.

అనుమతులు రాగానే పనులు

విలీన గ్రామాలకు తాగు నీరందించేందుకు రూ.129 కోట్లతో డీపీఆర్ తయారు చేసి పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ చీఫ్‌కు పంపాము. అక్కడ నుంచి అనుమతిరాగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం. సాధ్యమైనంత త్వరగా విలీన గ్రామాలకు నీరందిం చేందుకు కృషి చేస్తాం.

భానుప్రతాప్, కమిషనర్

రూ. 5.87 కోట్లతో వేసవి మంచినీటి ప్రణాళిక

ఏలూరు సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించడానికి జిల్లా ఆర్‌డబ్ల్యూ ఎస్ శాఖ వేసవి మంచినీటి ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో ఎక్కడెక్కడ మంచినీటి సమస్యలు తలెత్తు తాయో గుర్తించి అక్కడ మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రణాళిక కింద రూ.5.87 కోట్లు నిధులను కేటాయిం చారు. జిల్లాలో ప్రధానంగా 19 మండలాల్లోని 174 హేబిటేషన్లలో మంచినీటి సమస్యలు తలెత్తే అవకాశా లున్నాయని గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు నిధులు కేటాయించారు. ఆయా ప్రాంతా ల్లో 28,710 ట్రిప్‌ల వరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడానికి రూ.5.36 కోట్లు నిధులను కేటాయించారు. చాట్రాయి, ముసునూరు మండలాల్లో 14 ప్రాంతాలకు మంచినీటి సరఫరా చేయడానికి రూ. 3.20 లక్షలు, 155 చోట్ల మంచినీటి పథకాలకు సంబంధించిన బోర్లలో పూడిక తీయడానికి రూ.23.25 లక్షలు, 14 ప్రాంతాల్లో మంచినీటి బోర్లు లోతు చేయడానికి రూ.9.80 లక్షలు కేటాయించారు. జిల్లాలో 236 చెరువుల్లో నీటిని నింపాల్సి ఉంది. గోదావరి కెనాల్‌కు సంబంధించి 77 చెరువులు, కృష్ణా కెనాల్‌కు సంబంధించి 159 చెరువుల్లో నీరు నింపే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. 'జిల్లాలో ఎక్కడా మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. వేసవి మంచి నీటి ప్రణాళికను సిద్ధం చేశాం. గ్రామాల్లో మంచి నీటి సమస్యలను పరిష్కరించడానికి గ్రామ పంచాయతీలను అప్రమత్తం చేశాం. మంచినీటి వనరులను పటిష్టపరిచే చర్యలను చేపట్టా'మని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాధబాబు తెలిపారు.

కొండలరావుపాలెంలో.. 7
ఉద్రిక్తత
- మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి వద్ద కొల్లేరు లంక గ్రామస్థుల ధర్నా
- బకాయి సొమ్ము అడగడానికి వెళ్తే దాడి చేశారని బాధితుల ఆవేదన

చిరు వ్యాపారులకు
విద్యుత్ బిల్లుల షాక్

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల
సీనియార్టీ జాబితాలు

వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురి మృతి

లెక్క తేలుతోంది..!

- జిల్లాలోని పరిశ్రమల సంఖ్య తేల్చేందుకు ర్యాంప్ సర్వే
- ఇప్పటి వరకు గుర్తించినవి 54,836
- మూతపడినవి..7,039కి పైనే..
- సర్వే గడువు ఈ నెల 15 వరకు పెంపు


(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పరిశ్రమల లెక్కలు ఒక్కొక్కటిగా కొలిక్కి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమలను ఆదుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్మార్మెన్స్ (ర్యాంప్) సర్వేకు శ్రీకారం చుట్టింది. కొద్ది నెలలుగా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఈ సర్వే చేస్తున్నారు. విద్యుత్ డేటా ఆధారంగా ఇప్పటికి పనిచేస్తున్న పరిశ్రమల సంఖ్య 54,836గా తేలింది. ఎన్నికల కోడ్, ఇతరత్రా కారణాలతో సర్వే మందగమనంలో ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం ఈ గడువును మార్చి 15వ తేదీకి పొడిగించింది. వాస్తవంగా ఈ సర్వే ఫిబ్రవరి మొదటి వారంలో పూర్తి చేయాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో జాప్యం జరిగింది.

జిల్లావ్యాప్తంగా సిరామిక్, కోళ్లు, ప్లాస్టిక్, తవుడు నుంచి నూనెలు తీసే పరిశ్రమలు, ఇతర వస్తు తయారీ, ఐరన్, ఇటుకలు, ఫుడ్ ప్రాసెసింగ్ (చేపలు, రొయ్యి), ఐస్ ఫ్యాక్టరీలు తదితర రంగాల్లో మైక్రో స్మాల్, మీడియా పరిశ్రమలు నడుస్తున్నాయి. అయితే ఈ పరిశ్రమల సంఖ్య, ఆయా రంగాల్లో ఉపాధి పొందుతున్న కార్మికులు, ఉద్యోగులు ఎంతెంతమంది పనిచేస్తున్నారో వివరాలేక పోవడంతో ఈ సర్వేకు ప్రభుత్వం నడుం బిగించింది.

54,836 యూనిట్ల సర్వే పూర్తి

జిల్లాలో వివిధ పరిశ్రమలకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లు 74,172 లెక్కల ఆధారంగా ర్యాంప్ సర్వేను చేస్తున్నారు. ఇప్పటి వరకు 54,836 యూనిట్ల సర్వేను పూర్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, పరిశ్రమల శాఖ సిబ్బందిని సమన్వయం చేసుకుని వెళుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 24,664 పరిశ్రమల యూనిట్లు నడుస్తున్నట్టు గుర్తించారు. ఇందులో వస్తువుల తయారీ పరిశ్రమలు 3,115 ఉన్నట్లు లెక్కతేల్చారు. 10,835 సేవలు అందించే ఎంఎస్ఎంఈలుగా, వివిధ వ్యాపారాలు చేసే యూనిట్లు 10,770 ఉన్నట్టు తేల్చారు. 7,039 యూనిట్లు అసలు పనిచేయడం లేదని గుర్తించారు. నాన్ ఎంఎస్ఈలు (పరిశ్రమల కింద రానివి)గా 23,076గా గుర్తించారు. మొత్తంగా 54,836 యూనిట్ల సర్వే పూర్తయింది. ఇంకా 19,336 యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా పరిశ్రమలు స్థాపించిన వారిలో ఉద్యమ్ పోర్టర్‌లో ఆన్‌లైన్ నమోదు కావాల్సిన వారే ఎక్కువగా ఉన్నారు. ఈ తాజా లెక్కలతో 1,053 ఉద్యమ్ పోర్టర్‌లో రిజిస్టర్ అయినట్టు తేలింది. పరిశ్రమల శాఖ జీఎం పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పరిశ్రమల లెక్కలు తీసి.. వాటి పర్యవేక్షణ, ఇతర రకాలు ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


సింగవరంలో తవుడు నుంచి నూనె తీసే ఫ్యాక్టరీ

అసెంబ్లీలో ఎమ్మెల్యేల వాయిస్


రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండి



గత సంవత్సరం జూలై నెలలో వరదలకు పంట నష్టానికి గురైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. రైతులకు ఆగస్టు నెలలో నష్టపోయిన పరిహారం అందించారు. కానీ జూలై నెలలో పంట నష్టంపై అధికారులు ఇప్పటికే రూ.28 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. అధికంగా తాడేపల్లి గూడెం నియోజకవర్గంలోని ఎర్రకాలువ పరీవాహక గ్రామాల రైతులకు సబ్సిడీ అందాల్సి ఉంది.

– ప్రభుత్వ విప్, బొలిశెట్టి శ్రీనివాస్

రైతుల్ని ఆదుకోవాలి



గత ఏడాది అధిక వర్షాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. రూ.26కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ తక్షణమే విడుదల చేయాలి. తణుకు నియోజకవర్గంలో ఎర్రకాలువ ముంపు కారణంగా జూలై నెలలో వరదలు వచ్చాయి. ఈసమయంలో పెద్ద ఎత్తున రైతులు పంట నష్టపోయారు. అప్పట్లో అధికారులు, మంత్రులు సైతం సందర్శించి రైతులకు హామీ ఇచ్చారు. నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, ఉండి నియోజకవర్గాల పరిధిలో బాధిత రైతులు ఉన్నారు.

– ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే

కాలవలు ప్రక్షాళన చేయాలి



గత ప్రభుత్వం భీమవరం నియోజకవర్గంలో ఏ కాల్వలోను ఒక తట్ట చెత్త గాని తూడు గాని తీయలేదు. దీని వల్ల నియోజకవర్గంలోని వీరవాసరం, భీమవరం మండలాల్లో మొదటి క్రాప్‌లో వ్యవసాయం చెయ్యలేని పరిస్థితి నెలకొన్నది. రబీ సీజన్‌లో శివారు ప్రాంతాలకు నీరు అందటంలేదు. అన్నపూర్ణగా పేరు ఉన్న డెల్టా ప్రాంతం ఎడారిగా మారే పరిస్థితి వచ్చింది. దీనిపై యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పి. రామాంజనేయులు-భీమవరం ఎమ్మెల్యే

రైళ్లలో ఏదీ భద్రత..?

» రైల్వేస్టేషన్లలో పోలీసుల కొరత » నరసాపురం రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక్క ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ » జిల్లాలో 26 మంది జీఆర్పీ పోలీసులకు గాను ఉన్నది ఐదుగురే » రైళ్లలో పెరుగుతున్న నేరాలు » కొరవడిన రక్షణ



నరసాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):ఇటీవల లింగంపల్లి నుంచి నరసాపురం వస్తున్న రైళ్లలో ఫోన్ దొంగలించి పారిపోతుండగా ప్రయాణికుడు పట్టుకున్నాడు. నిందితుడిని విచారిస్తే 16కుపైగా చోరీకిగురైన సెల్‌ఫోన్లు బయటపడ్డాయి. గతంలో ఎన్నో చోరీలు చేసినట్టు పోలీస్ విచారణలో తేలింది. ఇదే రైలులో ల్యాప్‌ట్యాప్‌లు, చైన్‌స్నాచింగ్‌లు కూడా జరిగాయి. ఈ చోరీల్లో చిక్కుముడి వీడలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కేసులు ఉన్నాయి. వీటి నియంత్రణకు రైల్వే నిర్లక్ష్యమే కారణమన్న వాదనలు లేకపోలేదు. జిల్లాలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో ఉండే జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పూర్తి స్థాయిలో లేరు. నరసాపురం ఆర్పీఎఫ్ స్టేషన్‌లో పది మంది కానిస్టేబుళ్లు ఉండాలి. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఎస్సై కూడా లేరు. ఇలా జిల్లాలోని భీమవరం, తణుకు, టీపీగూడెం స్టేషన్లలో కూడా పూర్తి స్థాయిలో ఆర్పీఎఫ్ సిబ్బంది లేరు. ఈకారణంగా రాత్రి సమయాల్లో గస్తీ కూడా తగ్గిపోయింది. జిల్లా మీదుగా రోజు 45కు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిలో లింగంపల్లి, నాగర్‌సోల్, ధర్మవరం, శేషాద్రి, సర్కార్, ఎల్‌టీటీ, విశాఖపూరీ వంటి ప్రధాన రైళ్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ రైళ్లు రాత్రి పూటే నడుస్తున్నాయి. సిబ్బంది తక్కువగా ఉండటంతో అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

సిబ్బంది కొరత

జిల్లాలో నరసాపురం ప్రధాన రైల్వే స్టేషన్. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ల నిర్వహణ ఈస్టేషన్‌లోనే జరుగుతుంది. వచ్చిన ప్రతి రైలును జీఆర్పీ పోలీసులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. వాటిలో ఏమైనా పోతే వాటిని పరిశీలించి రిపోర్టు చేయాలి. అలాగే ప్రయాణికులు సామాన్లు మరిచిపోయినా... చోరీలు జరిగినా ఆ వివరాలను సేకరించాల్సి ఉంటుంది. రాత్రి పూట నిలిచిపోయిన రైళ్లలో చోరీలు జరగకుండా పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇక ప్రయాణికులు రైళ్లు ఎక్కేటప్పుడు తొక్కిసలాట జరగకుండా వారిని క్యూలో నిలబెట్టి జనరల్ బోగీలు ఎక్కించాలి. ఇలాంటి కీలక బాధ్యతల్ని ఆర్పీఎఫ్ పోలీసులు చేపడతారు. అయితే ప్రధానమైన స్టేషన్లలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ప్రయాణికులకు రక్షణ లేకుండా పోయింది. ఇటు ఉన్న సిబ్బందిపైనే ఒత్తిడి పెరిగిపోతున్నది. దీంతో ఒత్తిడి భారాన్ని తట్టుకోలే ఉన్న కొద్ది పాటి సిబ్బంది కూడా సెలవుపై వెళ్లిపోతున్నారు. ఈపరిస్థితి భీమవరం, తణుకు, టీపీగూడెం స్టేషన్లకు తప్పలేదు. రైల్వేకు సంబంధించి లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ జీఆర్పీ పోలీసులదే. రైళ్లలో గొడవలు జరిగినా... ఆత్మ హత్యలు చేస్తున్నా...చోరీలు జరిగినా... ఆ కేసుల్ని జీఆర్పీ లే కేసులు కడతారు. అంటే శాంతిభద్రతలకు సంబంధించిన పోలీసులు జిల్లాలో 28 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఈకారణంగా అరకొర సిబ్బందితో రైల్వేకు సంబంధించి లా అండ్ ఆర్డర్‌ను నిర్వహించడం కత్తి మీద సాములా మారింది. ఈ సమస్యపై వివరణ అడిగితే ఏ అధికారి నో కామెంట్ అంటారు. రైళ్లలో వెళ్లే ప్రయాణికులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత రైల్వేదే. అయితే దీనిపై రైల్వే పట్టించుకోవడం లేదన్న వాదనలు ప్రయాణికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

బీ.. ఏ హ్యూమన్ లఘు చిత్రానికి జాతీయస్థాయి గుర్తింపు



దర్శకుడు నవీన్‌తో చిత్ర బృందం

ఏలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మానవహక్కులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో జాతీయ మానవ హక్కుల సంఘం నిర్వహించిన లఘు చిత్రాల పోటీల్లో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన నవీన్ లొట్ల దర్శకత్వంలో చిత్రీకరించిన బీ.ఏ హ్యూమన్ లఘుచిత్రం 2024కు గాను సర్టిఫికెట్ ఆఫ్ స్పెషల్ మెన్షన్‌కు ఎంపికై రూ.50 వేల నగదు బహుమతి పొందినట్టు నవీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 నుంచి జాతీయ మానవ హక్కుల సంఘం నిర్వహిస్తున్న లఘు చిత్రాల పోటీలలో 303 లఘు చిత్రాలు పోటీ పడ్డాయని తెలిపారు. వాటిలో ఏడు లఘు చిత్రాలు విజేతలుగా నిలువగా నవీన్ లొట్ల దర్శకత్వం వహించి నిర్మించిన బీ.ఏ హ్యూమన్ లఘు చిత్రానికి సర్టిఫికెట్ ఆఫ్ స్పెషల్ మెన్షన్‌గా ఢిల్లీలోని జాతీయ మానవహక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ సి.రామ సుబ్రమణి యన్‌తో పాటు కమిషన్ జ్యూరీ పరిశీలించి ఎంపిక చేశారన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, గృహ హింస, ఆడ బిడ్డలను అనాధలుగా వది లేయడం, సమాజ జోక్యం ఇతివృత్తంగా నిర్మించిన తమ లఘు చిత్రం జాతీయ స్థాయిలో ఎంపికవడం పట్ల నవీన్‌తో పాటు చిత్రబృందం హర్షం వ్యక్తం చేసింది. ఈ ప్రోత్సాహంతో మరిన్ని సమాజ హిత లఘు చిత్రాలు నిర్మిస్తానని నవీన్ లొట్ల తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నన్నయ విద్యార్థినికి వెండి పతకం



విజేత రామలక్ష్మిని అభినందిస్తున్న వీసీ ప్రసన్న శ్రీ

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 87కేజీల కేటగిరిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థిని కర్నాటి నాగరామలక్ష్మి వెండిపతకం సాధించారు. ఈ సందర్భంగా విజేతను వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ సన్మానించి పతకం, ట్రోఫీని అందజేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో గత నెల14 నుంచి17 వరకు జరిగిన ఛాంపియన్‌షిప్‌లో నన్నయ అనుబంధ కళాశాలైన భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల విద్యార్థిని నాగరామలక్ష్మి ప్రతిభ కనబరిచి ఏప్రిల్‌లో గోవాలో జరిగే ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న కార్మికులు

మునిసిపల్ కార్మికుల నిరసన

ఏలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబాడ్జీలు ధరించి మునిసిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల మూడవ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద, ఆరో తేదీన విజయవాడలో జరగవలసిన ధర్నా కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొక్కా శ్రీనివాసరావు, కంతేటి వెంకట్రావు, నిమ్మల సుబ్బారావు, దోసూరి నాగరాజు, అయినాల ముత్యాలరావు, అప్పలస్వామి, బాలు, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి వద్ద ఉద్రిక్తత

బకాయి సొమ్ము అడగడానికి వెళ్తే దాడి చేశారని బాధితుల ఆవేదన



కొఠారు ఇంటి దగ్గర ఇరువర్గాలను నిలువరిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్ లో) ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న సురేశ్

పెదవేగి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : బకాయి సొమ్ము కోసం ధర్నా చేస్తుంటే దాడి చేశారని కొల్లేరు లంక గ్రామస్తులు తెలిపారు. వైసీపీకి చెందిన దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తమ చెరువులను సాగు చేసుకుని, ఐదేళ్లలో రూ.9కోట్లను బకాయి పడ్డారని, ఈ సొమ్ము రాబట్టుకోవడం కోసం రెండు నెలలుగా అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర ధర్నా చేస్తున్నామని తెలిపారు. రెండు నెలలుగా చేస్తున్న ధర్నాలో భాగంగా సోమవారం కొఠారు ఇంటిదగ్గర ధర్నా చేస్తున్నామని, ఈలోగా వైసీపీ నాయకులు కొంతమంది కూలీలను తీసుకొచ్చి తమపై దాడికి తెగబడ్డారని వారు ఆరోపించారు. దాడి సమాచారం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని లంక గ్రామస్తులకు అండగా నిలిచారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు నూజివీడు డీఎస్పీ కేవీఎస్‌వీ.ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ కె.రామకృష్ణ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఘర్షణ సమయంలో టీడీపీకి చెందిన అన్నపనేని సురేష్‌పై కొంతమంది వైసీపీ నాయకులు దాడిచేసి గాయపర్చారు. దీంతో అతనికి ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు

చిరు వ్యాపారులకు విద్యుత్ బిల్లుల షాక్

» కూల్‌డ్రింక్ షాపునకు రూ.1,96,574 బిల్లు » టీ దుకాణదారుడికి రూ.55,423 » సిబ్బంది తప్పిదాలతో వినియోగదారుల లబోదిబో



చిరు వ్యాపారులకు వచ్చిన విద్యుత్ బిల్లులు

ద్వారకాతిరుమల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ బిల్లులతో భారంగా బావిస్తున్న తరుణంలో విద్యుత్ సిబ్బంది తప్పిదాల వల్ల వినియోగదారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ద్వారకాతిరుమలలో యూనియన్ బ్యాంక్ సమీపంలోని ఓ కూల్‌డ్రింక్ షాపు యజమానికి ఈ మార్చి1న తీసిన విద్యుత్ బిల్లు ఏకంగా రూ.1,96,574 రావడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ప్రతినెల తనకు రెండువేల నుంచి మూడువేల రూపాయలలోపు బిల్లు వస్తుందని ఈసారి మాత్రం లక్షల్లో బిల్లు వచ్చిందని వాపోయాడు. గుడి సెంటర్‌లో ఉన్న ఓ టీ దుకాణదారుడు అప్పన్నకు ప్రతి నెల రూ.400లోపు బిల్లు వస్తుండగా ఈ నెల మాత్రం రూ.55,423 విద్యుత్‌బిల్లు రావడంతో ఒక్కసారిగా కుదేలయ్యాడు. చిరువ్యాపారులమైన తాము ఈ విద్యుత్ బిల్లులు చూసి బెంబేలెత్తుతున్నట్లు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు తమ బిల్లులు సరి చేయాలని కోరుతున్నారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు

ఏలూరు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, పురపాలక సంఘాలు, ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ సోమవారం విడుదల చేశారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాలకు సంబంధించిన అన్ని యాజమాన్యాల్లో (ప్రైవేటు మినహా) పనిచేస్తున్న మొత్తం 11,388 మంది హెచ్‌ఎంలు, ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజి పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు సీనియార్టీ నెంబర్లను కేటాయించారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిఐఎస్) ఆధారంగా రూపొందించిన ఈ జాబితాలను డీఈవో ఏలూరు.ఓఆర్‌జీ వెబ్‌సైట్, డీఈవో కార్యాలయ నోటీస్ బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. సీనియార్టీ జాబితాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 10వ తేదీలోగా ఏలూరు డీఈవో/కాకినాడ ఆర్జేడీ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలను లేవనెత్తే ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాలో ఎక్కడ తప్పిదం చోటుచేసుకున్నదీ ఆధారాలతోసహా పూర్తి వివరాలను స్పష్టంగా పేర్కొంటూ అందజేయాలని కోరారు. ప్రభుత్వం ఉమ్మడి జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుదినిర్ణయం తీసుకుని సంబంధిత హెచ్‌ఎం/టీచరుకు తెలియజేస్తుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఏలూరుజిల్లా డీఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ప్రశాంతికి యంగ్ రీసెర్చ్ ఉమెన్ అవార్డు



అవార్డు అందుకున్న ప్రశాంతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్ రసాయన శాస్త్ర విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ ఎస్ ప్రశాంతికి చెన్నై వీనస్ ఫౌండేషన్ ద్వారా యంగ్ ఉమెన్ రీసెర్చ్ ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అవార్డుతో సత్కరించారు. అంతర్జాతీయ ప్రచురణలు, పేటెంట్‌లు, రచించిన పుస్తకాలతో సహా ఆమె అసాధారణమైన పరిశోధనా సహకారాలకు గుర్తింపుగా ఈ అవార్డు అందించారు. అవార్డు అందుకున్న ప్రశాంతిని క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి అశోక్, క్యాంపస్ ఫ్యాకల్టీ సిబ్బంది అభినందించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురి మృతి

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి



పాలకోడేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరు గ్రామంలోని వంకాయలపాలెం రోడ్డులో ఊదరాల వెంకట్రావు (62) సోమవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇతనికి మానసికంగా ఇబ్బంది పడుతున్న కుమారుడు, వివాహమైన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇతను చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నాడు. వంకాయలపాలెం రోడ్డులోని రామాలయం వెనుక మృతదేహాన్ని గుర్తించారు. తలపై, ఒంటిపై గాయాలు ఉండటంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువెళ్లి కార్యక్రమాలు నిర్వహించినట్లుగా స్థానికులు అంటున్నారు. దీనిపై పాలకోడేరు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

పంటబోదెలో మృతదేహం



పాలకోడేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామంలోని దళితపేట చెరువును ఆనుకుని పంట బోదెలో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం రాత్రి స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పంటబోదె సమీపంలో తాడేపల్లి గూడెం వెళ్ళే రహదారిని ఆనుకుని మద్యం షాపు ఉండటంతో ఆ మద్యం షాపులో మద్యం తీసుకోవడానికి వెళ్లి పంటబోదెలో పడి ఉంటాడని స్థానికులు అంటున్నారు. ఇతని ఒంటిపై పచ్చరంగు లుంగీ, లైట్ కలర్ షర్ట్‌తోపాటు గెడ్డం, చింపిరి జుట్టు కలిగి ఉన్నట్లుగా స్థానికులు అంటున్నారు. ఇతని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మొగల్తూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం మూలలంకకు చెందిన కడలి నాగరాజు (55) ఈనెల 1వ తేదీన మూలలంక నుంచి నరసాపురం బైక్‌పై వెళుతుండగా ముత్యాలపల్లి పంచాయతీ చింతరేవు బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నాగరాజును నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడన్నారు. మృతుని భార్య దుర్గా మహేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో శవమై..

నరసాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయిన మహిళ సోమవారం గోదావరిలో శవమై తేలింది. ఎస్ఐ జయలక్ష్మి వివరాల ప్రకారం.. అరుంధతిపేటకు చెందిన శృతికుమారి(24) ఈనెల 1న భర్తతో కలిసి అన్నక్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. భర్త పని ఉందని వెళ్లిపోవడంతో తాను ఇంటికి వెళ్లాతానని చెప్పింది. భర్త ఇంటికి వచ్చే సరికి రాకపోవడంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సోమవారం బాపుఘాట్ వద్ద మహిళ మృతదేహం ఉందన్న సమాచారం పోలీసులకు వచ్చిందన్నారు. బయటకు తీసి చూడగా శృతికుమారి మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారన్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మోటార్ సైక్లిస్టు దుర్మరణం

పెంటపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన అలిసిపూడి శ్రీనివాస్ (50) పని నిమిత్తం ద్విచక్రవాహనంలో ప్రత్తిపాడు గ్రామానికి వచ్చాడు. తిరిగి తాడేపల్లిగూడెం వెళుతుండగా అలంపురం జాతీయ రహదారిపైకి చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

డ్రెయిన్‌లో మరో మృతదేహం

ఉండి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉండి ఇరిగేషన్ కార్యాలయం పక్కన వున్న బొండాడ డ్రెయిన్ మురుగుకాలువలో 35 నుంచి 40 సంవత్సరాలు గల గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు నలుపు రంగు డ్రాయర్ వేసుకుని వున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉండి నుంచి ఉప్పుగుంటకు వెళ్లే పంటకాలువలో బ్లూరంగు జీన్స్ ప్యాంటు వేసుకుని వున్న ఇదే వయసుగల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ



ఇంటి యజమానితో మాట్లాడుతున్న డీఎస్పీ డాక్టర్ శ్రీవేద

నరసాపురం టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టీమర్‌రోడ్ రామాలయం పక్కన నివాసం ఉంటున్న యల్లాప్రగడ వెంకటరత్నం ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బీరువాలు పగలగొట్టి తొమ్మిది కేజీల వెండి దోచుకుపోయారు. నాలుగు రోజుల క్రితం వెంకటరత్నం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఉదయం తలుపు తీసి ఉండటాన్ని స్థానికులు గుర్తించి వెంకటరత్నంకు ఫోన్ చేశారు. వెంటనే ఆయన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీవేద, సీఐ యాదగిరి సంఘటన స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీంను రప్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయలక్ష్మి చెప్పారు

పోలీసులకు మతిస్థిమితంలేని వ్యక్తి అప్పగింత

ఏలూరు క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ ఒక మహిళ వెనుక వెళుతుండడంతో ఆమె మెడలో గొలుసు తెంపుతాడనే భయంతో స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం బీహార్‌నకు చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పదంగా అటు ఇటు ఆ గ్రామ ప్రధాన సెంటర్లలో తిరిగాడు. ఒక మహిళ వెళ్తుంగా ఆమె వెనుక వెళుతుండడంతో చైన్ స్నాచింగ్ చేయడానికి పాల్పడుతున్నాడనుకుని స్థానికులు అతనిని పట్టుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడం హెడ్‌కానిస్టేబుల్ జీవరత్నం వచ్చి



అతనిని తీసుకువెళ్ళి ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారించారు. అతని మానసిక స్థితి సరిగా లేదని ఏదో రైలులో వచ్చి ఇలా తిరుగుతున్నట్లుగా గుర్తించారు. మొత్తం మీద అతను మతి స్థిమితం లేనట్లుగా గుర్తించారు.

నేటి నుంచి నన్నయలో నారీఫెస్ట్

రాజమహేంద్రవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 4 నుంచి మూడురోజుల పాటు నారీఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం తెలిపారు. తొలిరోజైన మంగళవారం మామ్మ(అమ్మమ్మ నానమ్మ)మనవరాలు ఫ్యాషన్‌షో, హెల్దీబేబీ పోటీలు జరుగుతాయన్నారు. హెల్దీబేబీ పోటీల్లో ఐదేళ్ల లోపు బాలబాలికలు పాల్గొనేందుకు అర్హులన్నారు. స్థానిక మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని వీసీ కోరారు. హెల్దీబేబీ పోటీలకు 63057 89433, మామ్మ-మనవరాలు పోటీలకు 99126 62500 నెంబర్లను సంప్రదించాలన్నారు. 5న వర్సిటీలో నన్నయ యూనివర్సిటీ, అనుబంధ కళాశాల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు, 6న అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహిస్తామని వీసీ పేర్కొన్నారు.

నిందితులను కస్టడీకి ఇవ్వండి

నాన్ డ్యూటీ పెయిడ్ మద్యంపై కోర్టులో ఎక్సైజ్‌శాఖ పిటీషన్

నరసాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం కేసులో నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని ఎక్సైజ్‌శాఖ కోర్టులో పిటీషన్ వేసినట్లు ఆశాఖ సీఐ రాంబాబు చెప్పారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈకేసును ఎక్సైజ్‌శాఖ చాలెంజ్‌గా తీసుకుందన్నారు. ఈనెల 26వ తేదీన నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలో 4,125 నిబ్‌లు పట్టుకున్నారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పరారీలో ఉన్న ఐదోవ నిందితుడు భరత్‌రెడ్డిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే యానాం, పరసర ప్రాంతాల్లో అతని కోసం గాలించామన్నారు. ఈకేసు దర్యాప్తును భీమవరం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డికి ప్రభుత్వం అప్పగించిందన్నారు. మరోవైపు నిందితుల్ని విచారించే ఒదుకు కోర్టులో పిటీషన్ వేశామన్నారు. రెండు రోజులు విచారణకు ఇమ్మని కోరడం జరిగిందన్నారు. దీనికి కోర్టు అనుమతిస్తే ఈకేసులో చిక్కుముడులు వీడతాయన్నారు. నిందితులకు మద్యం ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయం తేలాల్సి ఉందన్నారు. సీసాలపై ముద్రించి చినట్టు పట్టుకున్న మద్యం గోవాలో తయారైనట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

హెల్మెట్ ధరించాలంటూ విద్యార్థుల అవగాహన

ఏలూరు క్రైం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలని సందేశాన్ని ప్లే కార్డుల ప్రదర్శన ద్వారా ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రజలకు తెలియజేశారు. ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ గేటు ముందు విద్యార్థులు ప్లే కార్డులు చేతబట్టి ప్రదర్శన నిర్వహించారు. హెల్మె ట్ ప్రాణాలు కాపాడే కవచమని కుటుంబం కోసం హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు విద్యార్థులు వెల్లడించారు.

భీమడోలులో వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం

భీమడోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : భీమడోలులో అమ్మవార్ల గ్రామోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.సోమవారం గ్రామంలోని గ్రామ దేవతలు గంగానమ్మ, పోతురాజు బాబు, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ జాతర వేడుకల్లో భాగంగా గణాచారులు గ్రామ సంచారం నిర్వహించారు. అమ్మవార్ల ఘటాలతో మేళతాళాలు మంగళవాయిద్యాల మధ్య సంతమార్కెట్ తదితర ప్రాంతాల్లో గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు గ్రామంలోని మహిళలు మజ్జిగ, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో కళావేదిక ప్రారంభం

దెందులూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) :జిల్లా వ్యాప్తంగా విద్యాభివృద్ధికి ఆకుల నరసింహరావు, ఉమాలక్ష్మి చారిటబుల్ ట్రస్టు పని చేస్తోందని ట్రస్టు చైర్మన్ (ఎన్ఆర్ఐ)ఆకుల శ్రీధర్, ట్రస్టు నిర్వాహకులు ఆకుల వెంకట శివరామప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.2 లక్షలతో నూతనంగా నిర్మించిన కళావేదికను హైస్కూల్ హెచ్ఎం మల్లికార్జునరావుతో కలిసి ట్రస్టు నిర్వాహకులు ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఈ కళావేదికను నిర్మించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆశీర్వాదం గ్రంథపాలకుడు, గుళ్లపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోకో రైతుల సమస్యల పరిష్కారానికి 6న ధర్నా

ఏలూరు కార్పొరేషన్/పెదవేగి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక అన్నే భవనం వద్ద ఆయన మాట్లాడుతూ కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం రైతు నుంచి కొనుగోలు చేయాలన్నారు. కోకో గింజలు కిలోకు 900 రూపాయలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో కోకో పంట పండిస్తున్న రైతులంతా గోడును వినిపించేందుకు తరలిరావాలన్నారు. పెదవేగి మండలం విజయరాయిలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఛలో కలెక్టరేట్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

అనసూయమ్మ మృతికి ఎమ్మెల్యే సంతాపం

కామవరపుకోట, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : తడికలపూడికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొప్పన అంజియ్య మాతృమూర్తి బొప్పన అనసూయమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులకు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బొంతు వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు తూతా బాలు, వెలమాటి నాగేశ్వరరావు ఉన్నారు. అలాగే వడ్లపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన గంజి నాగ దీప్తి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కోనేరు వెంకట సుబ్బారావు, జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్ బాబు ఉన్నారు.

ఏలూరులోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : ఫాల్గుణ మాసంలోని తొలి సోమవారం నేపథ్యంలో నగరంలోని పలు డివిజన్లలోని శివాలయాల వద్ద సోమవారం భక్తులు అభిషేకాలు నిర్వహించారు. శివనగర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకులు వెంకటరత్నం శర్మ భక్తులతో సామూహిక పూజలు జరిపించారు.దక్షిణపువీధిలోని మార్కండేయస్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారంలోని నగరేశ్వర స్వామి, పాత శివాలయం, పవరుపేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, సత్యనారాయణపేటలోని రేపులింగేశ్వరాలయం, నాగేశ్వరపురం, బావిశెట్టి వారిపేటల్లోని కాశీ విశ్వేశ్వరాలయాలు, పత్తేబాద, ఆదివారపుపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద, గాంధీ నగర్‌లోని అవిముక్తేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు.

పక్షవాతం బాధితులకు మానవత సాయం

పోలవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పక్షవాతంతో మంచానపడ్డ బాధితులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ బోడిగూడెం గ్రామానికి చెందిన కొక్కెర గాంధీ, కలుం పండమ్మలు గత కొన్నేళ్లుగా పక్షవాతంతో మంచాన పడి ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నారు. విషయం తెలుసుకున్న మానవత సభ్యులు స్పందించి ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, ఆకుల నరసింహమూర్తి, చిలకా రాంబాబు, మూలెం వెంకన్నబాబు, వింజరం సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, సున్నం ప్రసాద్, హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు వాణి పాల్గొన్నారు.

భీమడోలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

భీమడోలు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : భీమడోలులోని పలు ఎరువుల దుకాణాల్లో కైకలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గిరిధరరావు, భీమడోలు మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఉషారాణి తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా భీమడోలు సంత మార్కెట్ సెంటర్‌లోని సత్య దుర్గా ట్రేడర్స్‌లో ఎరువుల షాపులను పరిశీలించారు. బిల్లులు లేకుండా 367 బస్తాల ఎరువులను రైతులకు అమ్మినట్లు గుర్తించారు. స్టాక్ నిల్వల నమోదు, ఇ పాస్‌లో అమ్మకాలు చూపడంలోనూ అనేక అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారం చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఎరువుల నాణ్యతలను పరిశీలించి దుకాణంలో నిల్వ ఉన్న 125 బస్తాల యూరియా, సంబంధిత రికార్డులను స్వాధీనపర్చుకున్నారు. నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖాధికారిణి ఉషారాణి తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది, వీర ప్రతాప్, రూపా దేవి పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి

ద్వారకాతిరుమల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేస్తే పాలదిగుబడి తగ్గుతుందన్న అపోహలను రైతులు వీడనాడాలని పశు వైద్యాధికారి అంగర సురేష్ కోరారు. గాలికుంటువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ద్వారకాతిరుమల కొండపై ఉన్న గోసంరక్షణ శాలలోని దాదాపు 300 గోవులకు, 50 దూడలకు ఈ టీకాలను వేశారు. గాలికుంటువ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడుతూ నోటిలోను, గిట్టల మధ్య పుళ్ల ఏర్పడతాయన్నారు. అలాగే పాల దిగుబడి సైతం తగ్గుతుందన్నారు. ఒక్కోసారి పశువు ప్రాణాలకే ప్రమాదమన్నారు. అలాగే 4-6 నెలల దూడలకు బ్రూసెల్లా టీకాలు వేయాలన్నారు. ఈ వ్యాధి పశువుల నుంచి మనుషులకు కూడా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా గంగానమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఏలూరు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలంలోని మాదేపల్లి గ్రామంలో శ్రీ మహాలక్ష్మి గంగానమ్మ, పోతురాజుబాబు, మద్దిరావమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈనెల 1వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మహోత్సవంలో భాగంగా సోమవారం గోపూజ, అభిషేకం, నిత్యపూజ అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని అమ్మవారిని ఆరాధించారు. నీరాజన మంత్రపుష్పం, వేదాశీర్వచనం తదుపరి పండిత సత్కారం జరిపారు. అనంతరం అఖండ అన్నసమారాధనను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పర్యావరణ పరిరక్షణకు జూట్ బ్యాగులు వాడాలి

ఏలూరు టూటౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడానికి జూట్ ఉత్పత్తులు వాడాలని సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి.ఇమ్మానియేలు పిలుపునిచ్చారు. సెంట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో జూట్ బ్యాగులను తయారు చేసేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు జూట్ బ్యాగులు వాడాలన్నారు. సెంట్‌జాన్ వెల్ఫేర్ సొసైటీ ఎండీ దీనాగ్లాడి మాట్లాడుతూ జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇస్తున్నామన్నారు. జూట్ బ్యాగుల్లో శిక్షణ పొంది ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా బ్యాంకులోన్ తీసుకుని ప్రతీ మహిళా ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పి.బాలస్వామి, సొసైటీ అధ్యక్షులు పెరికె వరప్రసాదరావు పాల్గొన్నారు.


బ్యాగుల గురించి తెలియజేస్తున్న రెవరెండ్ ఫాదర్ టి.ఇమ్మానియేలు

పత్తాలేని పల్లెవెలుగు

రాకపోలకు గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు - సర్వీసులను పునరుద్ధరించాలంటూ వేడుకోలు

టి.నరసాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పల్లెవాసుల రాకపోకలకు ఉపయోగపడే పల్లెవెలుగు బస్సులు నేడు పత్తాలేకుండా పోయాయి. టి.నరసాపురం మండలంలోని 15గ్రామ పంచాయతీలకు గత పదేళ్ల క్రితం వరకు పల్లె వెలుగు బస్సులు నడిచేవి.. జంగారెడ్డి గూడెం, ఏలూరు, తెలంగాణ రాష్ట్రం నుంచి సత్తుపల్లి, భద్రాచలం డిపోలకు చెందిన బస్సులు మండలంలోని అన్ని గ్రామాలను కలుపుతూ సమీప పట్టణాలకు చేరేవి.. దీంతో వ్యాపారులకు, విద్యార్థులకు, ప్రయాణికుల రాకపోకలకు ఎంతో సులువుగా ఉండేవి..ఇప్పుడు ఆ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు.

రహదారులు సరిగా లేక...

మండలంలోని గ్రామాల్లో రహదారులు ఛిద్రం కావడంతో ఆయా డిపోల బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో జంగారెడ్డి గూడెం నుంచి మల్లుకుంట, వల్లంపట్ల, సింగరాయపాలెం, బొర్రంపాలెం, వీరభద్రవరం, వెలగపాడు గ్రామాలకు చేరేవి.. జంగారెడ్డిగూడెం డిపో బస్సును లక్ష్మీపురం, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం మీదుగా మర్రిగూడెం, ఏలూరు నుంచి మల్లుకుంట, బొర్రంపాలెం, వెంకటాపురం, తిరుమలదేవి పేట గ్రామాలకు తిరిగేవి.. అలాగే గండిగూడెం, టి.నరసాపురం చేరుకునే రూట్లలో బస్సులు రద్దుచేయడంతో అవి కనుమరుగయ్యాయి.జంగారెడ్డిగూడెం డిపోనుంచి కామవరపుకోట నుంచి కొత్తగూడెం, అల్లంచర్లరాజు పాలెం, కొత్తగూడెం, బంధంచర్ల, టి.నరసాపురం నుంచి చింతలపూడి వెళ్ళే బస్సు సర్వీసులు కూడా నిలుపుదల చేశారు. ఇదే అదునుగా కొద్దిరోజుల పాటు బస్సు రాకపోకలు నిలిచిపోవడంతో మండలంలోని కొన్ని గ్రామాలకు ఆటో సౌకర్యం కలిగింది. అయితే మారుమూలన ఉన్న మర్రిగూడెం, గట్టుగూడెం, బస్సులేటివారిగూడెం, సున్నపురాళ్ళపల్లి వంటి గిరిజన గ్రామాలకు నేటికి ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు నానా పాట్లు పడుతున్నారు.



ప్రజల నుంచి అర్జీలు అందలేదు..

ఉన్న బస్సులను ఆయా రూట్లలో నడపడానికి సరిపోవడం లేదు. అంతే కాకుండా ఈ సమస్యలపై ప్రజల నుంచి మాకు ఏ విధమైన విన్నపాలు అందలేదు. అటువంటివి ఏమైనా వస్తే ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచి చర్యలు తీసుకుంటాం.

పి.పి.వి. గంగాధర రావు,
ఆర్టీసీ డిపో మేనేజరు జంగారెడ్డిగూడెం

రైతులకు ఇబ్బంది : మన్యం దుర్గారావు, తిరుమలదేవి పేట



గతంలో ఏలూరు నుంచి మా గ్రామానికి పలు గ్రామాలను కలుపుతూ బస్సు సౌకర్యం ఉండేది. రాత్రిపూట బస్సు ఇక్కడే నిలిపి ఉంచడంతో గ్రామంలోని రైతులు నిమ్మ, బత్తాయి వంటి తమ పంటలను ఏలూరు మార్కెట్‌కు తరలించడానికి సులభంగా ఉండేది. ప్రస్తుతం ఆ సౌకర్యం రద్దు చేయడంతో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. బస్సు సౌకర్యాన్ని మళ్లీ పునరుద్ధరించాలి.

బస్సు సౌకర్యం కావాలి : బి.వెంకటేశ్వరరావు, వెలగపాడు



మా గ్రామానికి గతంలో బస్సు సౌకర్యం ఉండేది. దాంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు జంగారెడ్డిగూడెం తదితర పట్టణాలకు చేరుకుని చదువుకునేందుకు వీలుగా ఉండేది. ప్రస్తుతం వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడుతున్నాం. బస్సు సర్వీసును పునరుద్ధరించి ఆదుకోవాలి.


దిప్పకాయలపాడు యూపీ స్కూల్ ఎదురుగా రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

దిప్పకాయలపాడులో పాఠశాలను కొనసాగించండి

రాస్తారోకో చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

కొయ్యలగూడెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పాఠశాలను యధావిధిగానే కొనసాగించాలని దిప్పకాయలపాడు గ్రామంలోని యూపీ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు రాస్తారోకో చేశారు. రెండు గంటల పాటు గ్రామస్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ గ్రామంలో ఉన్న యూపీ పాఠశాలలో 8వ తరగతి వరకు తరగతులు జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వం ఈ పాఠశాలను 5వ తరగతి వరకు కుదిస్తూ 6, 7, 8 తరగతులను కన్నాపురం జడ్పీ పాఠశాలలో విలీనం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. తమ గ్రామంలో 8వ తరగతి వరకు యధావిధిగా తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. పెద్దఎత్తున తల్లిదండ్రులు, విద్యార్థులతో పాటు గ్రామంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు ఆందోళనకు దిగారు. దీనిపై ఎంపీ పుట్టా మహేష్ స్పందించారని టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ తెలిపారు. వెంటనే జిల్లా విద్యాశాఖాధికారికి లేఖరాసినట్లు తెలిపారు. ఆ గ్రామంలోని పాఠశాలను యధావిధిగానే కొనసాగించాలని ఎంపీ కోరినట్లు నరేష్ తెలిపారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

జీలుగుమిల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : దర్భగూడెంలో భూ లక్ష్మీ అమ్మవారి 50వ వార్షికోత్సవం వేద మంత్రాలతో ఘనంగా ప్రారంభించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యాదర్శి జి. రవి కుమార్, కలశ స్థాపనలో పాల్గొన్నారు. అమ్మవారికి సహస్ర నామాలతో కుంకుమ పూజలు చేశారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో గ్రామ అడపడుచులు మొక్కులు చెల్లించుకుంటారని అర్చకులు జఠావల్లభుల త్రినాథమూర్తి చెప్పారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, కూటమి నాయకులు హనుమంతరావు, నెప్రశారెడ్డి, రాధాకృష్ణ ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభల్లో వక్తలు


టి.నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

టి.నరసాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టి.నరసాపురం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారం షెడ్యూల్లో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలతో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మార్చి ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. బాలికలు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించినట్లు ఆమె తెలిపారు.

విజయరాయిలో మహిళా దినోత్సవం

పెదవేగి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు అంగన్‌వాడీలు పని చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పి.శారద అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయరాయిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాలు నిర్మూలనపై చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పీడీ శారద మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అవరోధాలన్నారు. కనీస వయస్సు లేకుండా వివాహాలు చేస్తే బాలికల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థితిపై ప్రభావం పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు సమావేశాలు ఏర్పాటు చేసి, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు అదనపు సీడీపీవో ఎం.ఎస్.రాజశేఖర్, పీడీ కార్యాలయ విస్తరణాధికారి వి.మల్లిక, సూపర్‌వైజర్ కె.మేరీబాయమ్మ పాల్గొన్నారు.

విర్డ్ ఆసుపత్రిలో నలుగురికి శస్త్రచికిత్సలు

ద్వారకాతిరుమల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో తుంటి, మోకాలు మార్పిడి వైద్య సేవలందించారు. ప్రముఖ సర్జన్ డా.కృష్ణ కిరణ్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో 12మంది రోగులను పరీక్షించి అందులో నలుగురికి సోమవారం వైద్య సేవలందించారు. వీరికి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ రాజా ఎస్.వి.సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణ మూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పి.వి.నాగేంద్ర బాబు, సింధు, గాయత్రి పాల్గొన్నారు.


చిన్నారిని పరామర్శిస్తున్న వైద్యులు


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పీసా కమిటీని బలోపేతం చేయండి

పోలవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పీసా కమిటీ ఆమోదంతోనే గిరిజన గ్రామాల్లో నిర్ణయాలు జరగాలని కోండ్రుకోట పీసా కమిటీ సభ్యులు సోమవారం ఎంపీడీవో ఇ.శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ తెలియపరచాలని, కమిటీ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు పూనెం బుచ్చన్నదొర, పాయం శ్రీను, ముచ్చిక రంజిత్ కుమార్ దొర, పి గంగాధర రావు, టి.విద్యాసాగర్ పాల్గొన్నారు.


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ స్పీకర్ బాలయోగి వర్ధంతి

చింతలపూడి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : పార్లమెంటు మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతిని టీడీపీ పట్టణ కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారుమూడి థామస్, అనీష్ కుమార్, సాగర్, నాగేంద్ర, రాజు, రాజేష్ పాల్గొని నివాళులర్పించారు.


కంప్యూటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రగుంటపల్లి పాఠశాలకు వితరణ

చింతలపూడి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : ఎర్రగుంటపల్లి హైస్కూల్లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్, రెండు బీరువాలు బహూకరించారు. 1986-91 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులంతా కలిసి ప్రధానోపాధ్యాయుడు వి.బాబూరావుకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


చింతమనేనికి ఆశీర్వచనాలు పలుకుతున్న పండితులు

మొక్కజొన్న ప్లాంట్ పరిశ్రమ ప్రారంభం

దెందులూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : చిన్న పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని గంగన్నగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ఉప్పలపాటి మాణిక్యాలరావు నూతనంగా నిర్మించిన దీపక్ సీడ్స్ మొక్కజొన్న ప్లాంట్ పరిశ్రను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి లక్ష్మణరావు, టీడీపీ నేతలు గంటా ప్రసాద్, వెన్నమనేని రాజా, టీడీపీ నాయకులు అలపాటి నాగేశ్వరరావు, కంపెనీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి కల్పించండి

జీలుగుమిల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అసెంబ్లీలో గళం విప్పారు. గతంలో టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు ఐటీడీఏల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ప్రస్తుతం మన్యం అభివృద్ధికి ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చెయ్యాలని, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలన్నారు.

చేబ్రోలులో బంగారం చోరీ

ఉంగుటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. సూర్య భగవాన్ తెలిపారు. చేబ్రోలు గ్రామానికి చెందిన దాసరి కనకరాజు ఇంట్లో అర కాసు బంగారం, వెండి వస్తువులు పోయినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సోమవారం ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న పరివర్తన్ ప్రతినిధులు

దొండపాడులో ప్రపంచ వినికిడి దినోత్సవం

ఏలూరు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దొండపాడులోని పరివర్తన్ బధిరుల పాఠశాలలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఈ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా విభిన్న ప్రతి భావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ పి.రామ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వినికిడి దినోత్సవం రోజు వినికిడి లోపంపై అవగాహన పెంచడం, సంరక్షణను ప్రోత్సహించడం వంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ 25 ఏళ్లగా సంస్థ తరఫున వినికిడిలోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీఆర్సీ సిబ్బంది, దివ్యాంగ చిన్నారులు పాల్గొన్నారు.

గుడికి వెళ్లిన వృద్ధుడి అదృశ్యం

ఉంగుటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన పేద్ద రామ్మోహనరావు(70) అనే వృద్ధుడు బుట్టాయిగూడెంలో అదృశ్యమయ్యాడు. కైకరం గ్రామం నుంచి శనివారం రాత్రి గుబ్బల మంగమ్మ గుడికి మొక్కుబడి నిమిత్తం ఆదివారం బయలు దేరి వెళ్లారు. పూజల అనంతరం పేద్ద రామ్మోహనరావు కనిపించకుండాపోయాడు. దీంతో బుట్టాయగూడెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


బ్యాగును అందజేస్తున్న అధికారులు

సెక్యూరిటీ సిబ్బంది నిజాయితీ

ద్వారకాతిరుమల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది తమ నిజాయితీని నిరూపించుకున్నారు. ఆలయానికి స్వామి దర్శనం నిమిత్తం వచ్చిన కాకినాడకు చెందిన ఓ భక్తురాలు బంగారు నగలు ఉన్న బ్యాగ్‌ను పాదుకామండపం వద్ద వదిలేశారు. దీనిని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది అధికారులకు అప్పగించారు. దీంతో విషయాన్ని మైక్‌లో అనౌన్స్ చేయడంతో ఆ భక్తురాలు తిరిగి పాదుకా మండపం వద్దకు వచ్చి తన బ్యాగును అందుకుని సెక్యూరిటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

బుట్టాయగూడెం/ఉంగుటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి సెకండియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ బి.కుసుమ తెలిపారు. సెకండియర్ ఇంటర్ మొత్తం విద్యార్థులు 334 మంది ఉండగా 15 మంది గైర్హాజరు కాగా 319 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ సోమవారం పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. సెంటరులో ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉంగుటూరు మండలంలోని నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ద్వితీయ సంవత్సరం పరీక్షలకు గాను 112 మందికి గాను 107 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంటు వివరించారు.

ఇరుకు గదుల్లోనే విధులు...

బాదంపూడి సచివాలయ సిబ్బందికి తప్పని పాట్లు


అసంపూర్తిగా ఉన్న నూతన భవనం

ఉంగుటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : బాదంపూడి గ్రామంలోని సచివాలయానికి వినియోగిస్తున్న పాత పంచాయతీ కార్యాలయం విధుల నిమిత్తం సరిపోవడం లేదు. పన్నెండు మంది సిబ్బందితో నాలుగు గదుల కార్యాలయం ఇరుకుగా ఉన్నా అలాగే సిబ్బంది పని చేస్తున్నారు. అదే కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ హయాంలో నూతన సచివాలయ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న పుప్పాల శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాత సచివాలయంలో పనిచేయడానికి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చామన్నారు.



పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సచివాలయం

పాఠశాలల యథాస్థితినే కొనసాగించాలి

ఎస్‌ఎంసీ కమిటీల తీర్మానం

ముదినేపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తమ పాఠశాలల యథాస్థితినే కొనసాగించాలని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశాయి. మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, అప్పర్ ప్రైమరీ పాఠశాలల ఎస్‌ఎంసీ కమిటీలు ఆయా పాఠశాలల కమిటీల చైర్మన్ల అధ్యక్షతన సోమవారం అత్యవసర సమావేశాలు నిర్వహించి తమ పాఠశాల నుంచి 3, 4, 5 తరగతుల విద్యార్థులు దూరంగా ఉన్న మరో పాఠశాలకు వెళ్లడం ఇబ్బందికరం, ప్రమాదకరం అని పేర్కొంటూ, తమ పాఠశాలను బేసిక్ ప్రైమరీ పాఠశాలగానే ఉంచాలని తీర్మానం చేశారు. తీర్మానం కాపీలను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలు అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శక సూత్రాల ప్రకారం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను ఎస్‌ఎంసీ కమిటీల ఆమోదంతోనే చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీంతో పాఠశాలల యథాస్థితినే కొనసాగించాలని కమిటీలు తీర్మానించాయి. 117 జీవో ప్రకారం గతంలో ప్రాథమిక పాఠశాలల నుంచి హైస్కూళ్లలో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలపాలని కమిటీలు కోరాయి.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్

సెంట్రల్ జోన్ ఆటల పోటీల విజేతలకు అభినందన

ముదినేపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరు జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఏలూరు సెంట్రల్ జోన్ పాఠశాలల విద్యార్థుల ఆటల పోటీల్లో పాల్గొని త్రోబాల్ పోటీల్లో విన్నర్స్, ఖో-ఖో విభాగంలో రన్నర్స్‌గా విజయం సాధించారు. గతనెల 27న జరిగిన ఈ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతి రామోజీరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకట శ్యామల, వైస్ చైర్మన్ లాజరు, పీఈటీ వి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ కాకర్ల సంగీతరావు అభినందించారు.



చాట్రాయి, నూజివీడులో పాఠశాల విద్యార్థినులకు పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

విద్యార్థినులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

చాట్రాయి/ నూజివీడు టౌన్/ ఆగిరిపల్లి మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చాట్రాయి వికాస్ హైస్కూల్‌లో విద్యార్థినులకు మహిళా సాధికారత, హక్కులు, సమానత్వం అంశాలపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహిళా దినోత్సవం ప్రాముఖ్యత, సమాజంలో మహిళల పాత్ర, అభయ మహిళా రక్షణ దళం సేవలు ఉపయోగించుకోవటం ఎలా, అత్యవసర సమయాల్లో 100, 112 హెల్ప్‌లైన్ నెంబర్లు ఉపయోగించుకోవటం తదితర అంశాలపై ఎస్సై రామకృష్ణ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై గఫార్, ఉపాధ్యాయుడు కె.సూర్యనారాయణ, పాల్గొన్నారు.

నూజివీడు బాలికోన్నత పాఠశాలలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ పర్య వేక్షణలో మహిళా శక్తీకరణం, మహిళల భద్రత -మన బాధ్యత అనే అంశాలపై పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. ఆగిరిపల్లి హైస్కూల్ ప్రాంగణంలో ఎస్సై శుభశేఖర్ పర్యవేక్షణలో జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు



బహుమతులతో ఈదర ఉన్నత పాఠశాల విద్యార్థులు

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి /ముసునూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు శారద ఇంజినీరింగ్ కళాశాలలో నూజివీడు డివిజన్ స్థాయిలో ఆదివారం బాలోత్సవం నిర్వహించారు. ఈదర ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలాటం, సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. కోలాటం జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. మిగిలిన అంశాల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఎస్.శారద, సర్పంచ్ అనిత, ఏసుపాదం, కె.అంజయ్య అభినందించారు. ముసునూరు గురుకుల బాలికలు ఏడు విభాగాల్లో ప్రతిభ కనబర్చి నట్లు ప్రిన్సిపాల్ కె.ప్రవీణ తెలిపారు. పెయింటింగ్‌లో మొదటిస్థానం, స్టోరీ రైటింగ్‌లో ద్వితీయస్థానం, పద్యం, భావంలో తృతీయస్థానం, గ్రూప్ సింగింగ్‌లో ద్వితీయ స్థానం, క్విజ్‌లో తృతీయ స్థానంతోపాటు జూనియర్స్ విభాగంలో స్పెల్ బి, సోలో సింగింగ్ పోటీల్లో తృతీయ స్థానాల్లో బాలికలు నిలిచినట్లు ప్రిన్సి పాల్ తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న ముసునూరు గురుకుల బాలికలు

జిల్లాస్థాయి కబడ్డీ ఛాంపియన్‌గా ఆగిరిపల్లి హైస్కూల్ జట్టు

ఆగిరిపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్‌ను గెలుపొందారు. మార్చి 1,2 తేదీల్లో హీల్, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో జిల్లాస్థాయి హెచ్‌సీఎల్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆగిరిపల్లి జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. గోపిచంద్, ప్రహర్ష, సిహెచ్. అభిలాష్, బి.శివాజీ, వై.నాగరోహిత్, వై.జస్వంత్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శివనాగేంద్రరావు, సుగుణరావు, ఉమా మహేశ్వరిలను పాఠశాల హెచ్‌ఎం పుష్పలత అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత

గెలుపు దిశగా..

ఉమ్మడి కృష్ణా- గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాల్లో ఆలపాటికి ఐదు రౌండ్లకు 47 వేలపైనే అధిక్యం

మరో 5 రౌండ్లలో జరగనున్న లెక్కింపు



కౌంటింగ్ కేంద్రానికి వస్తున్న ఆలపాటి



కౌంటింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా సాగుతున్నట్టు తెలుస్తోంది. సోమవారం ఐదో రౌండు పూర్తయ్యే సరికి మొత్తం 1,40,297 ఓట్లు లెక్కించగా 14,888 ఓట్లు ఇన్‌వాలీడ్‌గా గుర్తించారు. కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు 84,595 ఓట్లు రాగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు 36,723 ఓట్లు లభించాయి. ఐదో రౌండ్‌కు ఆలపాటి 47,872 ఓట్ల ఆధిక్యతతో కొనసాగుతున్నారు.మిగిలిన రౌండ్లలో కూడా ఇదే విధంగా దూసుకుపోతే ఈయనకు 70 వేల నుంచి 80 వేల వరకు మెజారిటీ వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఆలపాటి విజయంపై దీమాగా ఉన్నారు. ఆ దిశగానే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆత్మీయ సమ్మేళనాలతో ఓటర్లకు దగ్గరయ్యారు. తన రాజకీయ అనుభవాన్నంతా రంగరించి ఎన్నికల సమరంలో దిగారు. విద్యావేత్తగా తన కున్న పరిచయాలను ఉపయోగించుకున్నారు. ప్రచారానికి సాంకే తికతను జోడించి పట్టభద్రులకు చేరువయ్యారు. దీనికి తోడు ఎక్కువ సంఖ్యలో పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించటం కూడా ఆయనకు కలిసొచ్చింది. తన ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రధానంగా ప్రస్తావించారు.

కూటమి పాలనపై సంతృప్తిగా ఉద్యోగులు

ప్రభుత్వంపై ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం కూడా ఈ ఎన్నిక ద్వారా పటాపంచలు కానుంది. కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులంతా కూడా సానుకూలంగా ఉన్నారన్నది స్పష్టమవుతోంది. ఉద్యోగుల ఓట్లపైనే ప్రధానంగా పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగ వర్గం అంతా కూడా కూటమి అభ్యర్థికే జై కొట్టింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపుతో ఆ పార్టీ యువ పట్టభద్ర ఓటర్లంతా కూడా ఆలపాటికి ఓట్లేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా ఆలపాటి గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆలపాటి గెలుపునకు కూటమి కలసి కట్టుగా కృషి చేసింది.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ఎమ్మెల్సీ స్థానం కావడంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం ఆయన తరచూ సమీక్షలు నిర్వహించారు. నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రతినిధులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆలపాటి విజయం కోసం ఉమ్మడి కృష్ణా జిల్లాలో వారు పడిన కష్టం అంతా, ఇంతా కాదు. ప్రతి నియోజకవర్గానికి పార్టీ అధిష్ఠానం పరిశీలకులను నియమించింది. పకడ్బందీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు ఉన్నారని మరోమారు ఈ ఎన్నికతో తేటతెల్లమైంది. మొదటి నుంచి ఆలపాటి లక్ష ఓట్ల మెజారిటీ సాధిస్తారని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి.

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రశాంతం

ముదినేపల్లి/ చాట్రాయి మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంట ర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమ వారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మూడు కళాశాలలకు చెందిన 112 మంది విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు రాయాల్సి ఉండగా, ముగ్గురు విద్యార్థులు హాజరు కాలేదు. పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి ప్రభాకర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్య నారాయణ మూర్తి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ సుధాకర్ పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఎస్‌ఐ వీరభద్రరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో మొత్తం 88 మంది విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరైనట్టు ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు.



ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద తనిఖీ.. చాట్రాయిలో పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



బలివేలో పారుశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ ప్రవీణ

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ముసునూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బలివే ఉత్సవాల్లో పారిశుధ్య మెరుగుకు తీవ్రంగా పని చేసిన కార్మికులకు సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రామస్వామి సోమవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సుమారు 28 మంది కార్మికులకు వారు తమ సొంత ఖర్చులతో వస్త్రాలు ఇచ్చారు.



అన్న క్యాంటీన్లో పేదలకు భోజనం

కైకలూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు అన్న క్యాంటీన్లో టీడీపీ నాయకుడు బీకెఎం నాని తన తండ్రి బొమ్మనబోయిన కృష్ణమూర్తి 21వ వర్ధంతి పురస్కరించుకొని మనవడు నీలపు శ్యాంబాబు, కుటుంబసభ్యులు సోమవారం 400 మంది పేదలకు అన్నదానం చేశారు. బీకేఎం బుజ్జి, పూల రామ చంద్రరావు, పుప్పాల సూర్యప్రకాశరావు, యలవర్తి మంగారావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పనులు వేగవంతం చేయాలి

మండవల్లి మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండవల్లి జడ్పీ హైస్కూల్‌ను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేడర్ కురేళ్ళ పంకజ్ కుమార్ సోమవారం సందర్శించి పీఎంశ్రీ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



కైకలూరు వెలమపేటలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వేగిరెడ్డి సురేష్

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన ర్యాలీ

కైకలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎక్కడైనా వివాహాలు జరిగితే దగ్గరలోని ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకురావాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ కృష్ణకుమారి అన్నారు. సోమవారం కైకలూరు ఓరియంట్ జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థినులకు మహిళా దినోత్సవం పురస్కరించుకొని బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాత్రి కైకలూరు వెలమపేటలో అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియ జేస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వేగిరెడ్డి సురేష్, హెచ్‌ఎం శ్రీకృష్ణ, ఉపాధ్యాయుడు ప్రసాద్, కార్యకర్తలు, పాల్గొన్నారు.



మండవల్లిలో వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న దృశ్యం

కొల్లేరులో వన్య ప్రాణులను రక్షించాలి

మండవల్లి మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజల జీవనోపాధిని, కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ అప్పారావు పేర్కొన్నారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం పురస్కరించుకొని మండవల్లిలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో వన్య ప్రాణులను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రజలకు తెలియజేస్తూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. భాస్కరరావు మాట్లాడుతూ వన్యప్రాణులు మానవ మనుగడకు ఎంతో అవసరమని, జీవ వైవిధ్యానికి నిలయమైన కొల్లేరును, ప్రకృతిలో భాగమైన వన్య ప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. జీవవైవిధ్యం దెబ్బతింటే పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ఐక్య వేదిక మండల, ప్రధాన కార్యదర్శులు జంగం శ్రీనివాసరావు, నాగరాజు, పుండరీకక్షుడు, టేకు బన్నీ, గుబిలి రామప్రసాద్, కోట వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది

వినికిడి లోపాన్ని సరిచేయవచ్చు

నూజివీడు టౌన్ , మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వినికిడి లోపాన్ని గుర్తించి తగు వైద్యపరికరాల ద్వారా వారి లోపాలను సరి చేయవచ్చని నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్ అన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా రోగులకు అవగాహన కార్యక్రమం, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధ్వనితో కూడిన శబ్ధాలు లోపలికి చేరటం ద్వారా చెవిలోని కణాలకు నష్టం జరిగి వినికిడి దెబ్బతింటుందన్నారు.

కొండలరావుపాలెంలో ఉద్రిక్తత

బకాయి సొమ్ము అడగడానికి వెళ్తే దాడి చేశారని బాధితుల ఆవేదన

పెదవేగి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : బకాయి సొమ్ము కోసం ధర్నా చేస్తుంటే దాడి చేశారని కొల్లేరు లంక గ్రామస్తులు తెలిపారు. వైసీపీకి చెందిన దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తమ చెరువులను సాగు చేసుకుని, ఐదేళ్లలో రూ.9 కోట్లను బకాయి పడ్డారని, ఈ సొమ్ము రాబ ట్టుకోవడం కోసం రెండు నెలలుగా అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర ధర్నా చేస్తున్నామని తెలిపారు. రెండు నెలలుగా చేస్తున్న ధర్నాలో భాగంగా సోమవారం కొఠారు ఇంటిదగ్గర ధర్నా చేస్తున్నామని, ఈలోగా వైసీపీ నాయకులు కొంతమంది కూలీలను తీసుకొచ్చి తమపై దాడికి తెగబడ్డారని వారు ఆరోపించారు. దాడి సమాచారం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని లంక గ్రామస్తులకు అండగా నిలిచారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు నూజివీడు డీఎస్పీ కేవీఎస్‌వీ.ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.రామకృష్ణ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఘర్షణ సమయంలో టీడీపీకి చెందిన అన్నపనేని సురేష్‌పై కొంత మంది వైసీపీ నాయకులు దాడిచేసి గాయపర్చారు. దీంతో అతనికి ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు



కొఠారు ఇంటి దగ్గర ఇరువర్గాలను నిలువరిస్తున్న పోలీసులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ట్రిపుల్ ఐటీలో ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీపై అవగాహన

నూజివీడు టౌన్, మార్చి 3 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీపై రెండురోజుల వర్క్‌షాపు నిర్వహించారు. ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌వోడి పి.శ్రావణి మాట్లాడుతూటెక్‌జెట్ ద్వారా ఎలక్ట్రికల్ వెహికల్‌పై ప్రాథమిక అవగాహన కల్పించడంతో పాటు వర్క్‌షాపు ద్వారా కనీసం నాలుగు స్టార్టప్‌లను సాధించే అవకాశం ఉంటుందన్నారు. టెక్నికల్ ట్రైనర్ ఎస్.దినేష్, ఎస్. దేవికిరణ్ పాల్గొన్నారు.



కల్వరి కొండపై ఏసు క్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

ముగిసిన మేరీమాత ఉత్సవాలు

కలిదిండి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మూడు రోజులుగా జరుగుతున్న మేరీ మాత ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చర్చి ఆవరణంలో కల్వరి కొండ వద్ద గల మేరీ మాత, ఏసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేసి అరటి గెలలు సమర్పించారు. పీఠాధిపతులను సత్కరించారు. ఏసు కృప బైబిల్ నాటకం ప్రదర్శించారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

8న మెగాలోక్ అదాలత్

కైకలూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల8వ తేదిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ అన్నారు. సోమవారం కైక లూరు న్యాయస్థానాల సముదాయాల వద్ద న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ చేసుకోదగిన కేసులన్నీ కక్షిదారులతో మాట్లాడి రాజీ మార్గం చూపాలన్నారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని ఎక్కువ కేసులు రాజీ పడేలా న్యాయవాదులు చూడాలన్నారు.

క్రైమ్ కార్నర్



ఆసుపత్రిలో క్షతగాత్రులు

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

నూజివీడు టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టిన సంఘటనలో ఆరుగురు గాయపడిన సంఘటన నూజివీడు పట్టణం రామాయమ్మరావుపేట వద్ద చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే నూజివీడు ప్రియాఫుడ్స్ నుంచి కూలీలను తీసుకు వెళుతున్న ఆటో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ అప్పలనాయుడితో పాటు నూజివీడు వెలమపేటకు చెందిన గేదెల వెంకటలక్ష్మి, మారగాని ఆదిలక్ష్మి, సబ్బవరపు వరలక్ష్మిలకు తీవ్ర గాయాలు అవ్వగా, మరో 16 మందికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను నూజివీడు ఏరియాఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

నూజివీడు పట్టణంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై వస్తున్న మంత్రి పార్థసారథి పట్టణంలో రహదారి ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులను తక్షణం తన వాహనంలో ఆసుపత్రికి పంపించారు. ఏరియా ఆసుపత్రి వైద్యులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాద ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

పాముకాటుకు కొల్లేరు యువకుడి మృతి



జయమంగళ జాన్ (ఫైల్‌ఫోటో)

కైకలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వలస వెళ్లిన కూలి పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన కొల్లేరులో విషాదం నింపింది. కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామానికి చెందిన జయ మంగళ జాన్ (18) గ్రామానికి చెందిన మరో 10 మందితో కలిసి శనివారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. అర్థరాత్రి సమయంలో పట్టుబడి చేసే ప్రదేశంలో చేపల చెరువు గట్టుపై ఉన్న షెడ్డులో నిద్రించారు. అందరి మధ్యలో జాన్ నిద్రించాడు. ఆ సమయంలో పాము కాటు వేయడంతో కొద్దిసేపటికి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతన్ని అమరావతిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కి తీసుకువెళ్లగా అప్పటికే అతను మృతి చెందాడు. చేతికందిన వచ్చిన కొడుకు పాముకాటుకు బలవడంతో కుటుంబసభ్యులు విలపిస్తున్న తీరు కంటతడి పెట్టించింది

12 మంది బైండోవర్

ఆగిరిపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో నేరాలకు పాల్పడిన ఆగిరిపల్లి మండలం, సింహాద్రి అప్పారావుపేట గ్రామానికి చెందిన 12 మందిని సోమవారం ఆగిరిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీరు మళ్లీ నేరాలకు పాల్పడితే లక్ష జరిమానా ప్రభుత్వం వారు అందించే సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు.